క్లుప్తంగా

17న షిర్డీసాయి సంకీర్తనా మందిర విగ్రహ ప్రతిష్ట

మండవల్లి: మండవల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీ షిర్డి సాయిబాబా మందిరంలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు స్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు శ్రీరామఫణికుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 15, 16వ తేదీల్లో ప్రత్యేక పూజలు, 17న ఉదయం విగ్రహం ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

చెత్త సేకరణ కేంద్రాల్లో పూల మొక్కలు పెంచాలి



మొవ్వ: చెత్త సేకరణ కేంద్రాల్లో పూల మొక్కలను పెంచాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) అరుణ సూచించారు. స్థానిక చెత్త సేకరణ కేంద్రాన్ని, ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారుల నుంచి వివరాలు సేకరించి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ టీ పూర్ణచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి కేవీ సోమేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ కే కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే జోన్ ఏర్పాటు హర్షణీయం

గుడివాడ టౌన్: విశాఖపట్నంలో ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు చేసేందుకు కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని బీజేపీ బందరు పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ సూరే గాంధి బుధవారం ఒక ప్రకటనలో హర్షం ప్రకటించారు. కేంద్రప్రభుత్వం తాను ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం ఏర్పాటు

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి మండల పంచాయతీల కార్యదర్శుల సంఘం బుధవారం ఏర్పాటు చేశారు. సంఘం అధ్యక్షుడిగా సుంకర హారిక గౌరవ అధ్యక్షుడిగా మల్లెల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా షేక్ యాకుషావలి, కార్యదర్శిగా పరసా సురేష్ సంయుక్త కార్యదర్శి సంబంగి సుబ్రహ్మణ్యం, ప్రచార కార్యదర్శిగా లోకం శివ నాగేశ్వరరావు, కోశాధికారిగా జుజ్జవరపు గిరిజ ఎంపికయ్యారు. వీరిని ఇతర కార్యదర్శులు సత్కరించారు.

తిరుపతమ్మ కల్యాణోత్సవాలు ప్రారంభం

ముదినేపల్లి రూరల్ : సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లో వేంచేసియున్న లక్ష్మీతిరుపతమ్మ ఆలయ వార్షికోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. తిరుపతమ్మ, గోపయ్య స్వామిని అందంగా అలంకరించి అర్చకుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన అన్నసమారాధనను ప్రారంభించారు. పార్టీ ముదిరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, మండల శాఖ అధ్యక్షుడు బోయిన రామరాజు, నాయకులు పాల్గొన్నారు.

మినుములో పల్లాకు తెగులు గుర్తింపు



మండవల్లి: మినుములో అక్కడక్కడా పల్లాకు తెగులను వ్యవసాయ అధకారులు గుర్తించారు. కొర్లపాడులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి మినుము పంట పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు. పల్లాకు తెగులు తెల్లదోమ ద్వారా మాత్రమే వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ తెగుల నివారణకు పంట మొదటి నుంచి విత్తన శుద్ధి చేయాలని తెలిపారు. తెల్లదోమ నివారణకు ఎసిటామిప్రైడ్ 0.25 గ్రాములు ఒక లీటరు నీటికి లేదా ప్రోఫెనొసాస్ 2 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి తెల్లదోమ ఉధృతిని ఆధారంగా 10-15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలన్నారు. ఏఓ ఎస్‌కె జరీనా, వీఏఏ చాప్లిన్, సర్పంచ్ వై నాగేశ్వరరావు, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కనుమూరు(పామర్రు): సైబర్ నేరాలపై అవగాహన కల్గి ఉండాలని పామర్రు ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని కనుమూరు గ్రామ ప్రజలకు సైబర్ నేరాలపై బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితులతో ఫోన్ ట్రాన్సాక్షన్ చేయవద్దన్నారు. ఇతరులు ఫోన్ చేసుకోవడానికి మీ ఫోన్‌ను నేరుగా ఇవ్వొద్దన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

ముదినేపల్లి రూరల్: పెయ్యేరు పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై డి.చంద్రకాంత్ జిల్లా అధికారులకు బుధవారం ఫిర్యాదు చేశారు. 2020-21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటిపన్ను బకాయిలు రూ.1.7 లక్షలు వసూలు చేసి, పంచాయతీకి జమ చేయలేదని పేర్కొన్నారు. గ్రామంలో 500 పైగా ప్రైవేటు కుళాయిలుండగా కేవలం 74 కనెక్షన్లకు మాత్రమే పన్ను వసూలు చేసినట్లు రికార్డుల్లో చూపి మిగిలినవి పంచాయతీకి జమ చేయలేదని తెలిపారు. వీటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రెండో అన్నవరంగా గుడ్లవల్లేరు

రేపటి నుంచి సత్యదేవుని బ్రహ్మోత్సవాలు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు సంతరోడ్డులోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయాన్ని రెండో అన్నవరంగా భక్తులు విశ్వసిస్తారు. ఈ ఆలయానికి వందేళ్ల చరిత్ర ఉంది. అన్నవరం తర్వాత స్వామివారు ఇక్కడే భక్తులకు ఎక్కువగా దర్శనమిస్తారని పెద్దలు చెబుతుంటారు. స్వామికి ఏటా జరిగే బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు విచ్చేస్తారు. పూర్వం పల్లెటూళ్ల నుంచి ఎడ్ల బండ్లపై రైతులు తమ కుటుంబాలతో కలిసి వచ్చేవారు. ప్రస్తుతం ట్రాక్టర్లలో వస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థాన నిధులతో స్వామి ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపాన్ని కూడా నిర్మించారు. ఈ మండపం పేదల వివాహాలు నిర్వహించుకునేందుకు అందుబాటు ధరలో దొరుకుతుంది. స్వామివారి మూల విరాట్ ఉండే గర్భగుడి పక్కనే ఉన్న నాగేంద్రస్వామికి మంచి ప్రసిద్ధి ఉంది. ఈ ఆలయానికి వచ్చే భక్తులు స్వామివారితో పాటు నాగేంద్ర స్వామికి కూడా మొక్కుతారు. ఈ నెల 7నుంచి 12వ తేదీ వరకు స్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. గ్రామమంతా ఒకేతాటిపై నిలబడి ఈ ఉత్సవాలను నిర్వహించడం పరిపాటి. భక్తితో పాటు స్వామివారి సన్నిధిలో భక్తుల మానసికోల్లాసం కోసం సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేస్తారు. స్వామి సన్నిధిలో భారీ అన్నసమారాధనను నిర్వహించటంతో ఈ బ్రహ్మోత్సవాలను ముగిస్తారు.



సత్యదేవుని ఆలయం



శ్రీ రమా సహిత సమేత సత్యదేవుని మూలవిరాట్

వందేళ్ల చరిత్ర



సత్యదేవుని ఆలయానికి వందేళ్ల చరిత్ర ఉంది. ఈ ఆలయంలో 72 ఏళ్ల నుంచి బ్రహోత్మవాలను ఊరంతా ఒకతాటి మీద నిలబడి చేయిస్తున్నారు. ఎడ్ల బళ్లపై ఆ రోజుల్లో జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఇక్కడికి వచ్చేవారు. ఇపుడు అదే భక్తుల తాకిడి ఏటా జరిగే బ్రహ్మోత్సవాల్లో ఉంటుంది.

– అట్లూరి దిలీప్‌కుమార్, ఆలయ మాజీ చైర్మన్

వ్రతాలు హైలెట్



గుడ్లవల్లేరులో సత్యదేవుడి ఆలయానికి రెండో అన్నవరంగా భక్తులు విశ్వసిస్తారు. స్వామివారి సన్నిధిలో భక్తులు ఈ బ్రహ్మోత్సవాల్లో జరిగే పూజల్లో తరిస్తున్నారు. ముఖ్యంగా ఈ బ్రహ్మోత్సవాల్లో వందలాది మందితో జరిగే సామూహిక సత్యనారాయణ స్వామివారి వ్రతాలు హైలెట్‌గా నిలుస్తాయి.

– రొంపిచర్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ అర్చకుడు

భక్తులదే బాధ్యతగా..



గ్రామమంతా ఒకేతాటిపై నిలబడి సత్యనారాయణ స్వామివారి బ్రహ్మోత్సవాలను నిర్వహించటం దశాబ్దాలుగా ఇక్కడ జరుగుతుంది. కేవలం స్వామి మీద భక్తిగానే కాకుండా భక్తులంతా అదొక ఆచారంగా బ్రహ్మోత్సవాలను నిర్వహించటం విశేషం. బ్రహ్మోత్సవాల్లో గ్రామాంలో భక్తులే ఎక్కువ బాధ్యతను తీసుకుంటారు.

– వి.డి.డి.ప్రసాద్, ఆలయ ఈఓ

అనుబంధ విభాగాల అధ్యక్షులకు అభినందనలు



అనుబంధ విభాగాల అధ్యక్షులతో ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కైకలూరు: నియోజకవర్గ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా ఎంపికైన నాయకులు గ్రామీణ స్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలంటూ వారిని జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కైకలూరు పార్టీ కార్యాలయంలో బుధవారం అభినందించారు. వీరిలో బోయిన చంద్రభోగేశ్వరరావు (ఆర్‌టీఐ విభాగం), రాచూరి మోహన్ కుమార్ (వాణిజ్య విభాగం), తుమ్మలచర్ల ఏసు (చేనేత విభాగం), సాక్షి సాయిబాబు (వైఎస్సార్ టీయూసీ, కార్మిక విభాగం), గోసాల రాజేష్ (దివ్యాంగుల విభాగం) ఉన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన నేతలు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, ముదినేపల్లి మండల ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ముదినేపల్లి మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రామరాజు, నాయకులు కిషోర్, రామకృష్ణ, కోటేశ్వరరావు, సుధాకర్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

మద్యం దుకాణం దరఖాస్తుల గడువు పెంపు

కైకలూరు: ప్రభుత్వం గీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణ దరఖాస్తులకు మూడు రోజులు గడువు పెంచినట్లు కైకలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సీఐ ఎస్‌కే రమేష్ బుధవారం తెలిపారు. నియోజకవర్గంలో 2024-2026 సంవత్సరానికి మండవల్లి మండలానికి గీత కార్మికులకు సంబంధించి శెట్టిబలిజ సామాజిక వర్గానికి మద్యం దుకాణం కేటాయించారని పేర్కొన్నారు. వాస్తవానికి ఈ నెల 5వ తేదీతో దరఖాస్తుల గడువు ముగిసిందన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ఈ నెల 8వ వరకు దరఖాస్తులు గడువు పెంచారన్నారు. బుధవారానికి మండవల్లి మండలంలో మద్యం దుకాణానికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఐదు దరఖాస్తులు అందాయన్నారు. దరఖాస్తుదారులు అప్లికేషన్‌తో పాటుగా రూ.2 లక్షలు తిరిగి చెల్లింపు లేకుండా రిజిస్ట్రేషన్ ఫీజు ఇవ్వాలన్నారు. ఏలూరులో సురేష్ చంద్ర బహుగుణ పోలీస్ స్కూల్ ఆడిటోరియం ఉదయం 9 గంటలకు కలెక్టర్ లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయిస్తారని తెలిపారు. దరఖాస్తుదారులు తహసీల్దారు జారీ చేసిన ఉపకులం, నివాస ధ్రువపత్రాలతో పాటు ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.

ఘనంగా కృష్ణామిల్క్ యూనియన్ వజ్రోత్సవం

పామర్రు: కృష్ణామిల్క్ యూనియన్ వజ్రోత్సవాలను బుధవారం పామర్రులో ఘనంగా నిర్వహించారు. పామర్రు క్లస్టర్ పరిధిలోని జమీగొల్వేపల్లి, పామర్రు పాల సంఘాలను సంఘ అధ్యక్షుడు వల్లభనేని రాజేంద్రబాబు, బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి తొలుత సందర్శించి, పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ ఎందరో మహానుభావుల కృషి కారణంగా 1965 ఫిబ్రవరిలో పామర్రులో పాల సేకరణ కేంద్రం ఏర్పాటుకు తొలి అడుగు పడిందన్నారు. అనంతరం దీర్ఘ కాలంగా సమితితో మమేకమై మూడు తరాలుగా పాలు సరఫరా చేస్తున్న పాడి రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఈ రోజున 1200 గ్రామాల్లో ఏటా రూ.11 కోట్ల లీటర్ల పాల సేకరణ, 12 వందల కోట్ల వార్షిక టర్నోవర్‌కు చేరిందన్నారు. సమర్థవంతమైన నిర్వహణతో రూ.200 కోట్ల మిగులు నిధులను సాధించగలిగామన్నారు. జమీగొల్వేపల్లి సంఘంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సరాసరి 230 లీటర్ల, పామర్రు సంఘం ద్వారా సరాసరిన 834 లీటర్లు పాల సేకరణ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రస్టు బోర్డు సభ్యులు గోళ్ల పూర్ణ మల్లికార్జునరావు, ఏజీఎం చల్లా అన్వేష్‌కుమార్, పామర్రు పాల శీతల కేంద్రం మేనేజర్ చిట్టూరి దామోదరకృష్ణ గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.



పాడి రైతులను సత్కరిస్తున్న యూనియన్ జిల్లా చైర్మన్ ఆంజనేయులు

ఆక్రమణలను తొలగిస్తాం



పామర్రు: పామర్రు మురుగు చానల్ గట్లపై ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు తగు చర్యలు తీసుకుంటామని డ్రెయినేజీ జేఈఈ ఎం భగవతి పేర్కొన్నారు. బుధవారం చానల్ పరివాహక ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఉరుటూరు వంతెన వద్ద నుంచి స్థానిక నాగులేరు కాలువ వంతెన వరకు సుమారు నాలుగు కిలో మీటర్ల ఉన్న ఈ చానల్లో ఉన్న ఇబ్బందులను సత్వరమే తొలగించేలా చూస్తామన్నారు. చానల్ గట్లను కొందరు ఆక్రమించి నివాస గృహాలను నిర్మించారన్నారు. గట్లపై ఉన్న ఈ ఆక్రమణలను గుర్తించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని భూ అక్రమణ చట్టం కింద స్థానిక రెవెన్యూ అధికారులు దృష్టికి తీసుకువెళ్లి ఆక్రమణల తొలగింపు చర్యలు చేపడతామన్నారు. అదే విధంగా చానల్లో పూడిక తీత పనులు చేపట్టేందుకు ఎస్టిమేషన్‌లను వేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

పోలీస్ బ్రదర్స్‌కు మంత్రి పరామర్శ

పమిడిముక్కల: రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాతో కలిసి బుధవారం వీరంకిలాకు ఎన్‌టీఆర్ కాలనీకు వెళ్లి పోలీస్ బ్రదర్స్‌ను పరామర్శించారు. రాజులపాటి మాధవరావు చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. మాధవరావు కుమారులు పెద్దాపురం క్రైం సీఐ రాజులపాటి అంకబాబు, మంత్రి సుభాష్ వ్యక్తిగత గన్‌మ్యాన్ వెంకటప్పయ్యను పరామర్శించి, కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మాధవరావు మృతి కుటుంబానికి తీరని లోటని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. సర్పంచ్ ఎం.సునీత, టీడీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, కృష్ణాపురం డీసీ చైర్మన్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.



మాధవరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే కుమార్ రాజా

ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యం

గుడ్లవల్లేరు: లక్ష డప్పుల గొంతుతో ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యమని ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర జనరల్ సెక్రటరీ బుల్లా త్యాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన గుడ్లవల్లేరులో విలేకరులతో మాట్లాడారు. రిజర్వేషను పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హైదరాబాద్‌లో మాదిగల మేలు కోసం చేపట్టిన బహిరంగ సభ ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్నట్లు చెప్పారు. మాదిగలంతా ఈ కార్యక్రమానికి విచ్చేసి దిగ్విజయం చేయాలని కోరారు.

ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

కైకలూరు: ప్రతి వాహనచోదకుడు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని పట్టణ ఎస్‌ఐలు డి.వెంకట్‌కుమార్, ఆర్.శ్రీనివాస్ తెలిపారు. హెల్మెట్ ధారణపై అవగాహన బుధవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. టౌన్ స్టేషన్ ఎదురుగా హెల్మెట్ల విక్రయ దుకాణం వద్ద పలువురికి జరిమానాలు విధించకుండా హెల్మెట్లను కొనుగోలు చేయించారు.

వెంట్రప్రగడలో..

వెంట్రప్రగడ(పెదపారుపూడి): వాహనదారులు అందరూ ట్రాఫిక్ నియంత్రణపై అవగహన కలిగి ఉండాలని ఏఎస్‌ఐ దుర్గారావు అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ ప్రధాన సెంటర్‌లో బుధవారం ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు.



హెల్మెట్లను కొనుగోలు చేసిన వాహనదారులతో ఎస్‌ఐలు

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



కూచిపూడి(మొవ్వ): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఇష్టపడి చదివి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని ఉయ్యూరు డివిజన్ విద్యాశాఖ అధికారి అయినంపూడి పద్మజారాణి సూచించారు. మొవ్వ మండలం కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్ర ఓరియంటల్ జెడ్పీ హైస్కూల్‌ను బుధవారం సందర్శించారు. ఈనెల 10వ తేదీన జరగనున్న ప్రీపబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులలో వచ్చే మార్కులను బట్టి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. హెచ్‌ఎం గుంటూరు వెంకట సత్య ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారి వెంబడి మురుగు నీటితో అవస్థలు

మండవల్లి: విజయవాడ-భీమవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు కింది నుంచి మురుగు నీరు వెళ్లడానికి ఏర్పాటు చేసిన తూము కారణంగా రోడ్డు వెంబడి నీరు నిలిచి ప్రజలు అవస్థలు పడుతున్నారు. స్థానిక కైకలూరు వీధిలోని వర్షం నీరుపోవడానికి గతంలో ఏర్పాటు చేసిన బోదె వెంబడి నీరు స్టేషన్ రోడ్డు వైపునకు వెళ్లి అయ్యవారిరుద్రవరం వైపు డ్రెయిన్‌లో కలవాల్సి ఉంది. ఆ విధంగా జరగకపోగా ఆ నీరు తిరిగి వెనుకకు వస్తుండటంతో ఇటీవల అధికారులు ఆర్‌అండ్‌బీ రోడ్డు అడ్డంగా కింది నుంచి తూము ఏర్పాటు చేశారు. దీంతో బోదెలోని నీరు ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన గుడివాడ వైపు అధికారులు ఏర్పాటు చేసిన రోడ్డు విస్తరణకు తవ్విన గుంతల్లోకి చేరుతోంది. దీంతో ఆ పరిసరాల గృహాలకు చెందిన వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీరు నిల్వ కారణంగా దోమలు విపరీతంగా వృద్ధి చెందాయని స్థానికులు వాపోతున్నారు. మురుగునీటిని కిందికి తరలించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఆర్‌అండ్‌బీ రోడ్డు వెంబడి నిలిచిన మురుగు నీరు

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

కైకలూరు: కైకలూరు గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై జంగారెడ్డిగూడెం డీఎల్‌పీఓ ఎండీ రజీవుల్లా బుధవారం విచరణ చేపట్టారు. 2021-22 ఆర్థిక లావాదేవీలపై ఈ విచారణ సాగింది. ఈఓకు బాధ్యతలు అప్పజెప్పకపోవడం, ఆర్థిక అవకతవకలపై 8,16 వార్డు సభ్యులు నాంచారయ్య, బీవీ రావు అందించిన ఫిర్యాదులపై విచారణ నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికురాలు దేవకృప జనవరి 6న ఇచ్చిన ఫిర్యాదుపై కూడా విచారణ చేశారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని రజీవుల్లా తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దానం మేరీనవరత్నకుమారి పాల్గొన్నారు.



నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టిన డీఎల్‌పీఓ రజీవుల్లా

ముమ్మరంగా చెరకు రవాణా

తోట్లవల్లూరు: చెరకు రవాణ ముమ్మరంగా సాగుతోంది. మండలంలోని పలు గ్రామాల్లో గత రెండు నెలలుగా చెరకు నరుకుడు, రవాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రొయ్యూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, భద్రిరాజుపాలెం, చాగంటిపాడు, దేవరపల్లి, గురివిందపల్లి, ఐలూరు, పెనమకూరు, తదితర గ్రామాల పరిధిలో రైతులు చెరకు పంటను విరివిగా సాగు చేశారు. ఒకప్పుడు అధిక విస్తీర్ణంలో సాగైన చెరకు పంట, సాగు ఖర్చులు, నరుకుడు, రవాణ చార్జీలు భారంగా మారుతుండటంతో క్రమంగా తగ్గుముఖం పడుతోంది. పన్నెండు నెలలపాటు పంటను పెంచుకుని, పక్వానికి రాగానే ఉయ్యూరు కేసీపీ కర్మాగారానికి రైతులు తరలిస్తారు. దీంతో కొంత కాలంగా ఎడ్లబళ్ల, ట్రాక్టర్ల ద్వారా చెరకు రవాణ జరుగుతోంది.



చెరకును కేసీపీకి తరలిస్తున్న ట్రాక్టర్

బడ్జెట్ పత్రాలు దహనం

గుడివాడ టౌన్: కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక పాలన కొనసాగిస్తుందని సీఐటీయూ, రైతుసంఘం నాయకులు ఆరోపించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట బడ్జెట్ పత్రాలను బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మికులు, రైతులు, చిన్న, సన్నకారు సామాజిక వర్గాలకు ఏ మాత్రం న్యాయం చేయలేదన్నారు. ఇది పూర్తిగా ప్రజావ్యతిరేక బడ్జెట్ అని, దీనిని వ్యతిరేకిస్తూ బడ్జెట్ నకళ్లు దహనం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి, నాయకులు ఎస్ మురళీకృష్ణారెడ్డి, టి.లక్ష్మణరావు, వై. నరసింహరావు, ఓ. గంగాధర్, కె. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్న నాయకులు

దోసపాడు చానల్ పరిశీలన

నందివాడ: మండలంలోని దోసపాడు చానల్‌ను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము బుధవారం పరిశీలించారు. నెహ్రాలి డ్రాప్ నుంచి ఇలపర్రు రెగ్యులేటర్ కింద వరకు రైతులు, అధికారులతో కలిసి ఆయన ద్విచక్ర వాహనంపై పర్యటించారు. కాలువలో తూడు, గుర్రపుడెక్క పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉండడాన్ని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే కాలువలో నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ డీఈ భరత్, డీసీ చైర్మన్లు బొమ్మనబోయిన ఏసుబాబు, యార్లగడ్డ రవి, వైస్ చైర్మన్ నంబూరి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



దోసపాడు చానల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాము

పేదల ఆకలి తీర్చటమే నిజమైన సేవ



జ్ఞానసాయికి అభిషేకాలు చేస్తున్న నాగమోహన్, లక్ష్మి దంపతులు



ఇంటింటికీ క్యారేజీల పంపిణీ చేస్తున్న షిరిడీ సాయి సేవా సంఘం

నిత్యం 45 మందికి క్యారేజీలు

ఇప్పటికీ నిత్యం 45మందికి క్యారేజీలను ఇంటింటికీ పంపుతున్నాం. క్యారేజీలో రెండు బాక్సులతో అన్నం, ఒక బాక్సులో పప్పుకూర, పచ్చడి, మరో బాక్సులో సాంబారు, పెరుగు ఉంటాయి. గురువారం బాబా డే సందర్భంగా స్వీట్, హాట్ క్యారేజీల్లో వెళ్తుంది. రెండు రోజులకు ఒకసారి అరటిపళ్లు కూడా ఉంటాయి.

– నాగమోహన్, లక్ష్మి దంపతులు

గుడ్లవల్లేరు: పేద వృద్ధులకు జానెడు పొట్ట నింపటమే నిజమైన ఆధ్యాత్మికతకు చెందిన సేవా మార్గమని అంటున్నారు అంగలూరు షిరిడీ సాయి సేవా సంఘం నిర్వాహకులు. సాయి చూపిన బాటలో వయసు పెరిగి దీనస్థితిలో ఉన్న అనాథ వృద్ధులకు, దివ్యాంగులకు భోజనం పెట్టడంతో పాటు వైద్యం అందించి, దుస్తులను ఇచ్చి వెన్నంటే ఉంటున్నారు. అవసాన దశలో ఉన్న ఆ వృద్ధులను చిన్నారులతో సమానంగా చూసుకుంటూ అండగా ఉండటమే నిజమైన ఆధ్యాత్మిక మార్గమని కొత్త అర్థం చెబుతున్నారు. మానవ సేవ చేయటమే మాధవ సేవగా భావిస్తున్నారు. షిరిడీ సాయి బాబా, తాజుద్దీన్, ఖాదరీబాబా వంటి అవధూతలు చూపిన మార్గం కూడా పేదవారికి ఆకలి తీర్చటమే నిజమైన ఆధ్యాత్మికత అని అంటున్నారు. అంగలూరు గ్రామ ప్రముఖుడు యలమంచిలి నాగమోహన్, లక్ష్మి దంపతులు ఈ సేవా సంఘాన్ని స్థాపించారు. 2010 నుంచి నిరుపేద వృద్ధులకు ఇంటింటికీ నిత్యాన్నదాన క్యారేజీల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

విద్యా వ్యాప్తికి ప్రతిభ మాస్టారు కృషి ఎనలేనిది

గుడ్లవల్లేరు: పేద కుటుంబాల్లో విద్యార్థులు బాగా చదువుకోవాలని విద్యా వ్యాప్తికి ప్రతిభ విద్యాలయం అధినేత దివంగత గోపిశెట్టి శ్రీనివాసరరావు (ప్రతిభ మాస్టారు) కృషి ఎనలేనిదని అప్స డెమొక్రటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అర్జా ప్రసాద్ అన్నారు. కూరాడ బాలాజీనగర్‌లో బుధవారం ప్రతిభ మాస్టారు చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతిభ మాస్టారు మృతితో పేద పిల్లల విద్యకు కొంత మేరకు ఇబ్బందులు కలిగిస్తుందన్నారు. స్థానిక శ్రీ సాయి విద్యానికేతన్ అధినేత శింగంశెట్టి ఆదినారాయణ, అసోసియేషన్ కోశాధికారి శ్రీనివాసరావు, సభ్యులు వెంకటేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.